ఈనాడు నిజామాబాద్
సోమవారం అక్టోబరు 21, 2024

గ్రంథాలయాలు బలోపేతం చేయాలి

♦ ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: గ్రామాల్లో గ్రంథాలయాలను బలోపేతం చేయాలని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన మద్ది చంద్రకాంత్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ఆదివారం హాజరైన ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని, ప్రభుత్వాన్ని తిట్టడమే కేటీఆర్, హరీశ్‌రావు పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. భారాస అధికారంలో ఉన్నప్పుడు దళితులకు మూడెకరాల సాగు భూమి, నిరుద్యోగ భృతి, రెండు పడకగదుల ఇళ్ల హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పాలకులు రూ.70 వేల కోట్ల అప్పుచేస్తే కేవలం పదేళ్లలో కేసీఆర్ ఒక్కరే రూ.7.15 లక్షల కోట్ల అప్పు చేశారని పేర్కొన్నారు. వారు చేసిన అప్పులకు నెలకు రూ.6 వేల కోట్ల వడ్డీ చెల్లిస్తున్నామని తెలిపారు. రైతులకు రుణమాఫీ చేసి తీరుతామని ప్రకటించారు. భారాస హయాంలో గుట్టలకు, భవనాలకు రైతుబంధు ఇచ్చారని. తమ ప్రభుత్వం అర్హులైన రైతులకు మాత్రమే రైతుభరోసా నిధులు జమ చేస్తుందని పేర్కొన్నారు. ఝార్ఖండ్, ఉత్తరాంచల్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో పాటు తెలంగాణను భాజపా ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రియాజ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్, కామారెడ్డి పుర ఛైర్‌పర్సన్ ఇందుప్రియ, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, ఏనుగు రవీందర్‌రెడ్డి, మానాల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

దశ తిరగాలి.. తెవివి మురవాలి

● వీసీగా యాదగిరిరావు బాధ్యతల స్వీకరణ నేడు

తెవివిలో గత పాలకుడు చేసిన అవినీతితో వర్సిటీ ప్రమాణాలు గాడితప్పాయి. ఫలితంగా ఉన్నత విద్య, పరిశోధనలో గుర్తింపునకు నోచుకోలేదు. వర్సిటీ ఏర్పాటయ్యాక ఎక్కువ కాలం ఇన్‌ఛార్జి పాలనే కొనసాగింది. సుదీర్ఘ కాలం తర్వాత ప్రభుత్వం తెవివికి వరంగల్ జిల్లాకు చెందిన ఆచార్య టి.యాదగిరిరావును వీసీగా నియమించింది. ఆయన నేడు బాధ్యతలు చేపట్టనున్నారు. 16 నెలల తర్వాత రెగ్యులర్ వీసీ వస్తుండటంతో వర్సిటీ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

న్యూస్‌టుడే, తెవివి క్యాంపస్





■ పాలన గాడిలో పెట్టాలి

2016లో తెవివి న్యాక్ 'బీ' గ్రేడు సాధించి రాష్ట్రంలో తొలిసారిగా న్యాక్ గుర్తింపు పొందిన వర్సిటీగా పేరొందింది. ఈ గుర్తింపు ముగిసిన వెంటనే మెరుగైన గ్రేడింగ్‌కు మళ్లీ వర్సిటీ సెల్ఫ్ స్టడీ రిపోర్టును సమర్పించాలి. తెవివి తర్వాత గుర్తింపు ముగిసిన రాష్ట్రంలోని పలు వర్సిటీలు(కాకతీయ, పాలమూరు, జేఎన్‌టీయూ) రిపోర్టులు సమర్పించి మళ్లీ న్యాక్ గుర్తింపు పొందాయి. తెవివిలో గత ఉన్నతాధికారులు మాత్రం గుర్తింపు సాధించడంలో మీనమేషాలు లెక్కించారు.

భారీగా ఉద్యోగ ఖాళీలు..

తెవివి డిచ్‌పల్లి ప్రధాన, సారంగాపూర్ ఎడ్యుకేషన్, భిక్కనూరు దక్షిణ ప్రాంగణాల్లో పీజీ, ప్రొఫెషనల్ కలిపి 20 కోర్సుల్లో విద్యనందిస్తోంది. ఈ కోర్సులకు 20 మంది ఆచార్యులు, 43 మంది సహ ఆచార్యులు, 89 మంది సహాయ ఆచార్య పోస్టులు మంజూరయ్యాయి. మొత్తంగా 152 పోస్టులకుగాను ప్రస్తుతం ఉన్నది కేవలం 61 మందే. 91 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక వర్సిటీలో 12 సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులు కొనసాగుతుండగా అకడమిక్ కన్సల్టెంట్లు, పార్ట్ టైం అధ్యాపకులతో నెట్టుకొస్తున్నారు. ఇక మూడు ప్రాంగణాల్లో ఇప్పటికీ కేవలం 8 మంది రెగ్యులర్ బోధనేతర ఉద్యోగులు ఉన్నారు. 270 మందికి పైగా పొరుగుసేవల ఉద్యోగులున్నారు. కనీసం 250కి పైగా రెగ్యులర్ బోధనేతర ఉద్యోగ పోస్టులు అవసరం ఉంది.

స్నాతకోత్సవ ■ ఊసేలేదు

తెవివి ప్రారంభించి 18 ఏళ్లు అవుతున్నా ఒక్కసారి మాత్రమే స్నాతకోత్సవం జరిపారు. వర్సిటీలో ఇప్పటికీ ఇంజినీరింగ్ కోర్సులు ప్రవేశపెట్టలేదు. ఉమ్మడి జిల్లాకే తెవివి పరిధి పరిమితమైంది. ఆదిలాబాద్, నిర్మల్, మెదక్ జిల్లాలకు తెవివి పరిధిని విస్తరించాలని గతంలో ఉన్నత విద్యా మండలి భావించి ప్రభుత్వ ఆమోదానికి నివేదిక సమర్పించినా ఇంకా అమలుకు నోచుకోలేదు.

రిజిస్ట్రార్ మార్పు తప్పదా..? ■

ప్రస్తుత రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి పదవి కాలం ఎప్పుడో ముగిసింది. ఇన్‌ఛార్జి వీసీల పాలన ఉండడంతో యాదగిరికి రిజిస్ట్రార్ పదవి పొడిగించి కొనసాగిస్తున్నారు. వర్సిటీలో అధ్యాపకుల్ని కట్టడి చేయడం, పరిపాలన సమర్థంగా నిర్వహించడంలో యాదగిరి రిజిస్ట్రార్ పదవికి న్యాయం చేయలేదనే విమర్శలు తీవ్రమయ్యాయి. అయితే కొత్త వీసీగా ఆచార్య టి.యాదగిరిరావు వస్తున్నందున రిజిస్ట్రార్ మార్పు తప్పదని వర్సిటీలో జోరుగా చర్చ నడుస్తోంది.

అకడమిక్ వాతావరణం ■ నెలకొల్పాలి

వర్సిటీలో అధ్యాపకులు రెండు గ్రూపులుగా విడిపోయారు. చాలా మంది వారానికి ఒక్కసారైనా వర్సిటీ మొహం చూడకుండా, విద్యార్థులకు పాఠాలు బోధించకుండా జీతాలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అకడమిక్ వాతావరణం, పాలనలో పట్టు సాధిస్తారని నూతన ఉపకులపతిగా వస్తున్న ఆచార్య యాదగిరిరావుపై ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు ఆశతో ఉన్నారు.

నిధుల కొరత

వర్సిటీ అభివృద్ధికి పదేళ్లుగా ఒక్క రూపాయి విడుదల చేయడం లేదు. వర్సిటీకి సంబంధించిన నిధులతో పలు నిర్మాణాలు చేపడుతున్న పరిస్థితి. అయితే మరో మహిళా హాస్టల్, ఆడిటోరియం, పరీక్షల విభాగం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ తదితర నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.



● గుర్తింపుతో సరిపెట్టారు..!
● సాధారణ శిక్షణ.. ఉత్తమ ప్రతిభ

వివరాలు.. 6లో

బాలుడి అపహరణ.. 36 గంటల్లో కేసు ఛేదన

● భిక్షాటన కోసం ఘాతుకం

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే : భిక్షాటన చేయించడానికి ఏడాది వయసున్న బాలుడిని అపహరించిన కేసును 36 గంటల్లోనే పోలీసులు ఛేదించిన ఘటన నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా మద్నూర్‌కు చెందిన రాజు తన భార్య లక్ష్మి అనారోగ్యానికి గురికావడంతో శుక్రవారం సాయంత్రం నిజామాబాద్ జిల్లా జనరల్ ఆసుపత్రి తీసుకొచ్చారు. సాయంత్రం ఓపీ లేకపోవడంతో శనివారం ఉదయం చూపిద్దామనుకొని రాత్రి ఆసుపత్రి ఆవరణలో మూడేళ్ల కూతురు, ఏడాది కుమారుడు మణికంఠతో కలిసి దంపతులు నిద్రించారు. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన అంజుమ్ బేగం, ఓ బాలిక(10), దుర్గా ప్రభురావుభా మోహతేలు అర్ధరాత్రి 12.20 గంటల సమయంలో బాలుడిని ఎత్తుకెళ్లారు. ఉదయం లేచిన తల్లిదండ్రులకు కుమారుడు కనిపించకపోవడంతో ఒకటో ఠాణాలో ఫిర్యాదు చేశారు. నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో, బస్టాండు పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. నిందితులు బాలుడిని తీసుకొని నాందేడ్ వెళ్లాలని రైల్వే స్టేషన్ చేరుకున్నారు. రైలు లేకపోవడంతో మళ్లీ నగరంలో చక్కర్లు కొట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన వీరి వద్ద బాలుడు ఉన్నట్లు ఒకటో ఠాణా పోలీసులకు సమాచారం రావడంతో రైల్వే స్టేషన్ ప్రాంతంలో పరిశీలించి నిందితులను అదుపులోకి తీసుకొని విచారించారు. బాలుడిని మహారాష్ట్ర తీసుకెళ్లి భిక్షాటన చేయించడానికి అపహరించినట్లు అంగీకరించారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు బాలుడిని సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చిన ఒకటో ఠాణా ఎస్‌హెచ్‌వో రఘుపతి నిందితులను కోర్టులో హాజరు పర్చారు. కేసును ఛేదించడానికి కృషిచేసిన ఏఎస్సై షకీల్, పీసీ గంగారాం, మహిళా కానిస్టేబుల్ అనూష, కానిస్టేబుళ్లు కేర్బాజీ, రాములును అధికారులు అభినందించారు.



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్‌హెచ్‌వో రఘుపతి, సిబ్బంది

ఆధునిక హంగులతో ఏటీసీలు

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో నిర్మిస్తున్న అధునాతన సాంకేతిక శిక్షణ కేంద్రాలు(ఏటీసీ) సరికొత్త హంగులతో అందుబాటులోకి రానున్నాయని పాలనాధికారి రాజీవ్ గాంధీ హన్మంతు ఆదివారం ప్రకటనలో తెలిపారు. కేంద్రాల శాశ్వత భవన నిర్మాణాలు, శిక్షణ తరగతుల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సత్వరమే ఉద్యోగ, ఉపాధి లభించేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. ఏటీసీలో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు క్యాంపస్ డ్రైవ్ ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో అప్రెంటిస్‌షిప్, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. పదో తరగతి పూర్తిచేసిన వారు నేరుగా కోర్సుల్లో చేరవచ్చని తెలిపారు. నిజామాబాద్ ప్రభుత్వ బాలుర, బోధన్, కమ్మర్‌పల్లి ప్రభుత్వ ఐటీఐల్లో ఈ నెలాఖరు వరకు ముఖాముఖిలకు హాజరై ప్రవేశాలు పొందాలని సూచించారు.



భవన సముదాయం నమూనా

ధాన్యం.. రైతన్నల దైన్యం

అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేశారు. ధాన్యం చేతికి వచ్చాక అమ్ముకుందామని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లారు. ఇంకొందరు తేమ ఉందని ఆరబెట్టారు. ఇంత చేసినా వారి ఆనందం కొద్ది రోజులు కూడా ఉండడం లేదు. వరుణుడు వారితో దోబూచులాడుతున్నాడు. జిల్లాలో శనివారం అర్ధరాత్రి దాటాక కురిసిన వర్షాలకు రైతులు ఆరబెట్టుకున్న ధాన్యం తడిసి ముద్దయింది. అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి వసతులు కల్పించకపోవడంతో పంట తడిసిందని వాపోయారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కోటగిరి, పొతంగల్, సాలూర


కోటగిరిలో తడిసిన వడ్లు చూపుతున్న రైతు సాదక్


సాలూర : మందర్నలో..

'కేసీఆర్‌తోనే తెలంగాణ రాలేదు'

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: కేసీఆర్‌తోనే తెలంగాణ ఏర్పాటైందని భారాస ప్రచారం చేయడం రాష్ట్ర ప్రజలను అవమానించడమేనని ఎమ్మెల్సీ ఆచార్య కోదండరాం పేర్కొన్నారు. వ్యక్తితో కాకుండా ప్రజల సంఘటిత శక్తితో స్వరాష్ట్ర కల సాకారమైందన్నారు. జిల్లాకేంద్రంలో టీజేఏసీ(తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ) ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ నియంతృత్వ పోకడతో గాడి తప్పిన ప్రభుత్వ వ్యవస్థలు ఇప్పుడే సజావుగా సాగుతున్నాయన్నారు. రాష్ట్ర సాధనలో అమరుల కుటుంబాలకు అడుగడుగునా అన్యాయమే జరిగిందన్నారు. వాటిని సరిదిద్దాల్సిన బాధ్యత ప్రజాస్వామికవాదులపై ఉందని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా నిర్బంధాలు అమలు చేసి.. ఇప్పుడు గ్రూప్ 1 అభ్యర్థులను తమ స్వార్థం కోసం వాడుకోవడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించడానికి ఐటీఐలను అభివృద్ధి చేస్తుందన్నారు. నాయకులు గోపాల్‌శర్మ, గైని గంగారాం, భాస్కర్, రవీంద్రనాథ్ సూరి తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ ఆచార్య కోదండరాం


సమావేశంలో మాట్లాడుతున్న భారాస జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి

'రైతులను పట్టించుకోని సర్కారు'

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదని భారాస జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆరోపించారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పారని విమర్శించారు. రూ.80 వేల కోట్ల అప్పులు తీసుకొచ్చిన కాంగ్రెస్ సర్కారు రైతులకు రూ.7 వేల కోట్ల పెట్టుబడి సాయం చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. అన్ని పంటలకు బోనస్ ఇస్తానని చెప్పి వరికి మాత్రమే ప్రకటించడం సరికాదన్నారు. అన్నదాతలకు తమ పార్టీ అండగా ఉంటుందన్నారు. సమావేశంలో జడ్పీ మాజీ ఛైర్మన్ విఠల్‌రావు, నుడా మాజీ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సిర్ప రాజు, రవిచందర్, సత్యప్రకాష్ ఉన్నారు.

నుడా ఛైర్మన్ ప్రమాణ స్వీకారం నేడు

నిజామాబాద్ అర్బన్: నుడా(నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఛైర్మన్‌గా కేశ వేణు సోమవారం నగరంలోని కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు హాజరవుతున్నారు.

ఎస్సారెస్పీ 17 గేట్ల ఎత్తివేత

శ్రీరామసాగర్: ఎస్సారెస్పీలోకి ఎగువ నుంచి 67562 క్యూసెక్కుల వరద చేరుతోంది. ఆదివారం ప్రాజెక్టు 17 గేట్లు ఎత్తి గోదావరిలోకి నీరు వదులుతున్నారు. ప్రాజెక్టు నిండుకుండలా 80.5 టీఎంసీలతో ఉంది. 53108 క్యూసెక్కులు గోదావరిలోకి వదులుతున్నారు. కాకతీయ కాల్వకు 5800, ఎస్కేప్ గేట్ల ద్వారా 2200, లక్ష్మి కాల్వకు 150, మిషన్ భగీరథకు 231, వరదకాల్వకు 5000 క్యూసెక్కులు వదులుతున్నారు.

నిజాంసాగర్ నీటి విడుదల

నిజాంసాగర్: నిజాంసాగర్ జలాశయం ఒక వరద గేటును ఎత్తి మంజీరాలోకి నీరు వదులుతున్నట్లు చేస్తున్నట్లు జలవనరులశాఖ ఏఈఈ శివప్రసాద్ తెలిపారు. పూర్తిస్థాయిలో 1405 అడుగుల నీటిమట్టం ఉందన్నారు.

తెలంగాణ ప్రభుత్వము
అదనపు కలెక్టర్ మరియు ఛైర్మన్, జిల్లా కొనుగోలు కమిటి వారి కార్యాలయం, నిజామాబాద్

No. B1/428/2024 Dated: 19-10-2024

TENDER NOTICE

నిజామాబాద్ జిల్లా నందు గ్రామ పంచాయతీల 2వ సాధారణ ఎన్నికల నిమిత్తము (545) గ్రామ పంచాయతీలకు సంబంధించి దాదాపు 10.00 లక్షల బ్యాలెట్ పేపర్లు ముద్రించుటకు గతములో ఇట్టి పనిని చేపట్టిన అనుభవము కలిగిన అర్హులైన ఆఫ్‌సెట్ ప్రింటింగ్ ప్రెస్ యాజమానుల నుండి టెండర్లు ఆహ్వానించనైనది.

టెండర్ దరఖాస్తు ఫారాలు తేది: 21-10-2024 ఉదయం 11-00 గంటల నుండి తేది: 28-10-2024 ఉదయం 11-00 గంటల వరకు జిల్లా పంచాయతి అధికారి కార్యాలయము, నిజామాబాద్ జిల్లా కార్యాలయాల సమీకృత భవనము (ఐడిఓసి) రూమ్ నెం. 23 నందు లభించును. టెండరు దాఖలుకు చివరి తేది: 28-10-2024 మధ్యాహ్నం 3-00 గంటల వరకు మరియు తేది: 29-10-2024 మధ్యాహ్నం 3-00 గంటలకు అదనపు కలెక్టరు (రెవెన్యూ), నిజామాబాద్ గారి ఛాంబర్ నందు టెండర్ తెరవబడును. అదనపు సమాచారము కోసం జిల్లా పంచాయతి అధికారి కార్యాలయము, నిజామాబాద్ నందు పనివేళలలో సంప్రదించవలెను. ఫోన్ నెం: 9849900112 పై కూడా సంప్రదించవచ్చును.

సం/- అదనపు కలెక్టర్ మరియు ఛైర్మన్ జిల్లా కొనుగోలు కమిటి, నిజామాబాద్ తరపున

పర్యాటక ప్రణాళికలు.. కార్యరూపం దాల్చేనా..?

● తెరపైకి టెంపుల్ టూరిజం సర్క్యూట్

ఈనాడు, కామారెడ్డి

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కామారెడ్డి జిల్లా యంత్రాంగం ప్రణాళికలు రూపొందిస్తోంది. నిజాంసాగర్, పోచారం జలాశయాల సందర్శనకు వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం రిసార్టులు, వసతి గృహాల నిర్మాణాల కోసం భూసేకరణకు రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. తాజాగా పర్యాటక శాఖ రాష్ట్ర వ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటకాన్ని అభివృద్ధి చేయడంలో భాగంగా జిల్లాలోని కాలభైరవస్వామి, సిద్ధరామేశ్వర స్వామి ఆలయాలను బాసర ఆలయంతో కలుపుతూ ప్రత్యేకంగా టెంపుల్ టూరిజం సర్క్యూట్‌ను సిద్ధం చేసింది. ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చితే పర్యాటక అభివృద్ధికి అడుగులు పడి నిరుద్యోగులకు, వివిధ రంగాల వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

జలాశయాల వద్ద ఎకో-టూరిజానికి..

నిజాంసాగర్, పోచారం జలాశయాలతో పాటు సమీపంలోని అటవీ ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రెవెన్యూ అధికారులు ఈ జలాశయాల పరిసరాల్లో పర్యటించి భూసేకరణకు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో చారిత్రకంగా పేరొందిన కౌలాస్‌కోట, దోమకొండ కోటలతో పాటు చూడదగిన ప్రదేశాల్లో మౌలిక వసతుల కల్పన, రవాణా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కొన్నేళ్లుగా జిల్లాలోని జలాశయాలు, సందర్శనీయ ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు యంత్రాంగం ప్రతిపాదనలు, ప్రణాళికలు రూపొందిస్తున్నా.. అడుగులు ముందుకుపడడం లేదు. పాలకులు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది.


పోచారం జలాశయం వద్ద ఎకో-టూరిజం అభివృద్ధికి ప్రాంతాలను పరిశీలిస్తున్న అటవీ అభివృద్ధి సంస్థ అధికారులు

చారిత్రక ప్రదేశాలకు నిలయం

నిజాం పాలకుల సమయంలో నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టు, వందేళ్లు పూర్తిచేసుకున్న పోచారం జలాశయం, వెయ్యేండ్లకు పైగా చారిత్రక వైభవానికి చిహ్నమైన కౌలాస్ కోట రాష్ట్రానికే తలమానికంగా ఉన్నాయి. వీటితో పాటు జిల్లాలో కాలభైరవ స్వామి, సిద్ధరామేశ్వర, సోమేశ్వర, తెలంగాణ తిరుమల, తాండూర్ త్రిలింగేశ్వరాలయం, చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయాలున్నాయి.



గుర్తింపుతో సరిపెట్టారు..!

● విడుదల కాని ఎన్‌క్వాస్ నిధులు
● రెండేళ్లుగా ఎదురుచూపులు

న్యూస్‌టుడే, నిజామాబాద్ వైద్యవిభాగం

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్‌క్వాస్(నేషనల్ క్వాలిటీ అస్సురెన్స్ స్టాండర్డ్స్) గుర్తింపు అందిస్తుంది. గుర్తింపు పొందిన వాటిలో వసతులు మెరుగుపర్చడానికి నిధులు కేటాయిస్తుంది. కానీ మూడేళ్లుగా ఈ పథకం కింద రావాల్సిన నిధులు విడుదల కావడం లేదు. ప్రజలకు మంచి సేవలందించి గుర్తింపు పొందినా నిధులు రాకపోవడంతో చేపట్టాల్సిన ప్రగతి పనులు ఆగిపోయాయని ఆయా దవాఖానాల వైద్యులు, సిబ్బంది వాపోతున్నారు.





ఉన్నతాధికారులకు నివేదించాం

- రాజశ్రీ, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి

గత రెండు సంవత్సరాలుగా ఎన్‌క్వాస్ గుర్తింపు పొందిన ఏ ఆరోగ్య కేంద్రానికి నిధులు అందలేదు. ఈ నిధులు కోసం ఇటీవల ఉన్నతాధికారులకు సైతం సమాచారం ఇచ్చాం. నిధులు రాగానే ఇస్తామని ఈ నిధులు కేంద్రం నుంచి రావాల్సి ఉంటుందని అవి రాగానే పంపిస్తామన్నారు.

ఎంపికైన వాటికి రూ.3 లక్షలు..

ఎన్‌క్వాస్‌కు ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాలకు జాతీయ గుర్తింపుతో పాటు ప్రత్యేకంగా ఏడాదికి రూ.3 లక్షల చొప్పున మూడేళ్లపాటు నిధులు అందిస్తారు. అత్యవసర మందులు అందుబాటులో ఉంచడంతో పాటు ఇతర సేవలకు ఈ నిధులు వాడాల్సి ఉంటుంది.

ఎంపికతో సరిపెట్టిన ప్రభుత్వం నిధుల విడుదలలో జాప్యం చేస్తోంది. సీజనల్ వ్యాధుల విజృంభణతో ఆయా పీహెచ్‌సీల్లో మందుల కొరత ఉంది. నిధులు వస్తే ప్రజలకు మందులు అందుబాటులోకి తీసుకురావచ్చని ఆసుపత్రి వైద్యులు పేర్కొంటున్నారు.

ప్రస్తుత పరిస్థితి..

కరోనా కారణంగా రెండేళ్ల పాటు ఎన్‌క్వాస్ గుర్తింపు ప్రక్రియ నిలిచిపోయింది. మళ్లీ 2022లో ప్రక్రియ ప్రారంభించారు. 2022-2023, 2023-2024 ఆర్థిక సంవత్సరాలకు నిజామాబాద్ జిల్లాలో చౌట్‌పల్లి, కమ్మర్‌పల్లి, ఎడపల్లి, వేల్పూర్, మెండోరా, దేగాం, పోతంగల్, నందిపేట్, సాలూర పీహెచ్‌సీలు, కామారెడ్డి జిల్లాలో మరో 15 ఎంపికయ్యాయి. యూపీహెచ్‌సీల్లో దుబ్బ, అర్సపల్లి, మాలపల్లి, బోధన్‌లోని రాకాసిపేట, పాన్‌గల్లి, కామారెడ్డి జిల్లాలో 5 ఎంపికయ్యాయి.


జిల్లా జట్టుతో సంఘం ప్రధానకార్యదర్శి గంగామోహన్

సాఫ్ట్‌బాల్ విజేతగా జిల్లాజట్టు

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా బాలికల జట్టు విజయకేతనం ఎగురవేసింది. వరంగల్‌లో ఈనెల 18 నుంచి 20 వరకు నిర్వహించిన పోటీల్లో మహబూబ్‌నగర్ జట్టుపై విజయం సాధించి విజేతగా నిలిచారని సాఫ్ట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ప్రభాకర్, గంగామోహన్ తెలిపారు. ఉత్తమ బ్యాటర్‌గా కీర్తన(సాంఘిక సంక్షేమ పాఠశాల, సుద్దపల్లి) ఎంపికైందని పేర్కొన్నారు. జట్టుకు శిక్షకులు, మేనేజర్లుగా నరేశ్, సెంథిల్, బూలాబాయి, సౌమ్యరాణి వ్యవహరించారు.

సాధారణ శిక్షణ.. ఉత్తమ ప్రతిభ

● క్రీడల్లో సత్తా చాటుతున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

న్యూస్‌టుడే, బాన్సువాడ

బాన్సువాడ పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటుతున్నారు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థినులు పాల్గొనగా. . 14 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఒకే పాఠశాల నుంచి ఇంత మంది ఎంపిక కావడంతో పాఠశాల ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్రస్థాయిలో రాణించి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షిస్తున్నారు. ఖోఖో విభాగంలో అండర్-17లో నలుగురు, అండర్-14 ఒక్కరు, వాలీబాల్ అండర్-17లో ముగ్గురు, అండర్-14 ముగ్గురు, కబడ్డీలో అండర్-17లో ఇద్దరు, అండర్-14లో ఒక్కరు ఎంపికయ్యారు. వీరితో పాటు మరో వెయిటింగ్ లిస్టులో నలుగురు ఎంపికయ్యారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన వీరందరూ సాధారణ శిక్షణతోనే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారికి నాణ్యమైన శిక్షణ అందిస్తే జాతీయస్థాయిలోనూ రాణించే అవకాశం ఉంది.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాన్సువాడ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు

ప్రతిరోజు సాధన చేశా

- నందిని, తొమ్మిదో తరగతి

ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లా పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యా. ప్రతిరోజు ఉదయం మైదానంలో సాధన చేశా. మంచి శిక్షణ ఇప్పిస్తే మరింత రాణిస్తాం. జాతీయస్థాయిలో ఎంపిక కావాలని ఉంది.

కబడ్డీలో ఎంపికయ్యా

- లావణ్య, పదో తరగతి

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యా. గత ఏడాది సైతం ఎంపికై జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. మరో సారి పాల్గొనే అవకాశం ఉంది. ఈ సారి ఉత్తమ ప్రతిభను చాటాలని ఉంది.

జాతీయస్థాయికి అర్హత సాధిస్తా

- సాయిప్రియ, పదో తరగతి

ఇక్కడ వాలీబాల్‌లో చాలా మంది రాణించారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని వాలీబాల్ సాధన చేస్తున్నా. జిల్లాస్థాయిలో రాణించా. ప్రస్తుతం రాష్ట్రస్థాయికి ఎంపికయ్యా. అక్కడ ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధిస్తా.



మినీ స్టేడియంపై నీలినీడలు

● కూలిన పైకప్పు, ప్రహరీ

న్యూస్‌టుడే, వేల్పూర్

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులకు సౌకర్యాలు కరవయ్యాయి. మైదానాలున్న చోట నిర్వహణ లోపం వెక్కిరిస్తోంది. యువజన సంఘాల పోరాట స్ఫూర్తితో సాధించుకున్న వేల్పూర్ మినీస్టేడియంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇక్కడ రూ.కోటితో ఇండోర్ స్టేడియం నిర్మించారు. చుట్టూ ప్రహరీ కట్టారు. ఇందులో ఓపెన్ జిమ్ సైతం ఏర్పాటు చేశారు. వేల్పూర్‌తో పాటు పచ్చలనడ్కుడ, వెంకటాపూర్, కోమన్‌పల్లి గ్రామాల నుంచి నిత్యం యువకులు వ్యాయామం, వాకింగ్, రన్నింగ్ కోసం వచ్చేవారు. రెండేళ్ల క్రితం భారీ ఈదురుగాలులకు స్టేడియం పైకప్పు కూలిపోయింది. అప్పటి నుంచి గ్రహణం పట్టింది. బాగు చేసే వారు లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఇటీవల వర్షాలకు ప్రహరీ సైతం కూలిపోయింది. స్టేడియంలో ఏర్పాటు చేసిన 400 మీటర్ల ట్రాక్ పూర్తిగా గడ్డి, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. విషపురుగులకు అడ్డాగా మారడంతో క్రీడలు ఆడేందుకు ఎవరూ వెళ్లడంలేదు. నియోజకవర్గాల్లో మినీ స్టేడియాలు ఏర్పాటు చేస్తామంటున్న ప్రభుత్వం ఉన్న వాటిని అందుబాటులోకి తీసుకురావాలని క్రీడాకారులు కోరుతున్నారు.


గోడ ధ్వంసమైందిలా..

రూ.35లక్షలు మంజూరు :

ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి



వేల్పూర్‌లోని ఇండోర్ స్టేడియం మరమ్మతులకు రూ.35లక్షలు మంజూరు అయ్యాయి. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ జరుగుతోంది. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి.

పిచ్చిమొక్కలు తొలగిస్తాం:

మల్లేశ్ జిల్లా క్రీడల నిర్వహణ అధికారి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రహరీ కూలిపోయింది. ఈ విషయమై ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. మైదానంలో గడ్డి, పిచ్చిమొక్కలు తొలగిస్తాం. ఆటలు ఆడుకునే విధంగా చర్యలు చేపడతాం.

చిన్నపాటి వ్యాయామాలతో ఆరోగ్యం

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నపాటి వ్యాయామాలు చేస్తే ఆరోగ్యాన్ని భద్రంగా ఉంచుకోవచ్చని నేషనల్ శాంపిల్ సర్వే ఉప ప్రాంతీయ కార్యాలయం ఇన్‌ఛార్జి, స్వచ్ఛ భారత్ నోడల్ అధికారి డి.భరత్‌రాజ్ అన్నారు. జాతీయ గణాంక, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 5.0లో భాగంగా ఆదివారం రఘునాథ చెరువు(మినీ ట్యాంకు బండ్)తో పాటు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అవగాహన కల్పించారు. వ్యాయమాలతో కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. డిప్యూటీ మున్సిపల్ ఛైర్మన్ రాజేంద్రప్రసాద్, నాగమోహన్, యోహన్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.


వ్యాయామం చేస్తున్న స్వచ్ఛ భారత్ నోడల్ అధికారి భరత్‌రాజ్ తదితరులు

కవితల పోటీలకు ఆహ్వానం

నిజామాబాద్ సాంస్కృతికం: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని చిన్నారులకు ప్రత్యేకంగా జిల్లాస్థాయి కవితల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇందూరు జిల్లా బాలసాహిత్యవేదిక అధ్యక్షుడు కాసర్ల నరేశ్‌రావు తెలిపారు. ఆదివారం నగరంలోని సంస్థ కార్యాలయంలో కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. నేను-నా బాల్యం అంశంపై కవితలు రాయాలన్నారు. 6 - 12వ తరగతి చదివే విద్యార్థులు అర్హులన్నారు. కవితలను నవంబరు 5లోగా పంపిస్తే విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో శారదా హన్మాండ్లు, శ్రీనివాసగుప్తా, ఆనంద్, చంద్రశేఖర్‌శర్మ, రమణాచారి, ధనుంజయ పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలని వినతి

నిజామాబాద్ విద్యావిభాగం: కేజీబీవీ ఉపాధ్యాయులకు కనీస వేతనం అమలు చేయాలని, ఆదర్శ పాఠశాలల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి హాజరైన ఆయనకు సమస్యలు వివరించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ బకాయిల విడుదలకు కృషి చేయాలని కోరారు. వెంట రాష్ట్ర బాధ్యులు రామకృష్ణారెడ్డి, కీర్తి సుదర్శన్ ఉన్నారు.



ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో ఉపాధ్యాయ సమస్యలను చొరవ తీసుకొని పరిష్కరించాలని ఎస్టీయూ, 2003 ఉద్యోగ, ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట సమితి ప్రతినిధులు ఎమ్మెల్సీ కోదండరాంను కోరారు. ఆదివారం జిల్లాకేంద్రానికి వచ్చిన ఆయనను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఖాళీగా ఉన్న జేఎల్, డైట్ అధ్యాపక పోస్టులను పదోన్నతులతో నింపాలని, జీవో నంబరు 317తో వేరే జిల్లాలకు వెళ్లిన వారిని సొంత ప్రాంతానికి రప్పించాలన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస వేతనం, 2003 ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మేందర్, శ్రీకాంత్, పాత పెన్షన్ పోరాట సమితి ప్రతినిధులు వినోద్‌కుమార్, రవీందర్, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్సీ కోదండరాంనకు సమస్యలు వివరిస్తున్న ఎస్టీయూ ప్రతినిధులు





మాట్లాడుతున్న ఉన్నత విద్యామండలి మాజీ ఛైర్మన్ ఆర్.లింబాద్రి, సభకు హాజరైన విద్యావంతులు, విద్యార్థులు

ప్రగతిశీల భావజాలం పెంపొందించాలి

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రస్తుత కాలంలో 80శాతం మంది విద్యార్థులు ప్రైవేటు విద్యాలయాల్లో చదువుతున్నారని, వారిలో ప్రగతిశీల భావజాలాన్ని పెంపొందించాలని ఉన్నత విద్యామండలి మాజీ ఛైర్మన్ ఆర్.లింబాద్రి పేర్కొన్నారు. నగరంలోని న్యూఅంబేడ్కర్ భవన్‌లో ఆదివారం పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అర్ధశతాబ్ది ఉత్సవ సభ నిర్వహించారు. సభకు ముఖ్యఅతిథిగా ఆచార్య లింబాద్రి పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురవారెడ్డితో కలిసి హాజరయ్యారు. శ్రీకాకుళం నక్సల్బరీ పోరాటాల కాలంలో ప్రగతిశీల ఆలోచన విధానంతో పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఏర్పడిందని గురవారెడ్డి వివరించారు. ఇలాంటి సమ్మేళనాలు భవిష్యత్తులో మరిన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం పూర్వ నాయకులు పద్మారావు, మాధవరావు, శ్రీదేవి, శ్రీహరి, సాయికుమార్, పాపయ్య, భాస్కర్, సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గౌతమ్‌కుమార్, రాజేశ్వర్, కార్తీక్, ప్రిన్స్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాల అమలు సరికాదు

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా, రైతు వ్యతిరేక విధానాలు అమలుచేయడం సరికాదని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు విమర్శించారు. ఆదివారం ఎన్‌ఆర్ భవనంలో నిర్వహించిన జిల్లాకార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రైతు ఉద్యమ సమయంలో కేంద్రం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. జిల్లాలో మూతపడ్డ చక్కెర కర్మాగారాలు రాష్ట్ర ప్రభుత్వం తెరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు భూమయ్య, ప్రధానకార్యదర్శి సాయిరెడ్డి, ఎర్రయ్య, కృష్ణగౌడ్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు


ఎంపికైన క్రీడాకారులతో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి


చదరంగంలో సత్తాచాటిన క్రీడాకారులతో సంఘం ప్రతినిధులు

ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ ఎంపికలు పూర్తి

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో అండర్-14 బాలబాలికల విభాగంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహించామని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

విజేతల వివరాలు..బాలురు : సింగిల్స్‌లో: విజేత మిథున్, ద్వితీయ వీర్, తృతీయ శ్రీకర్

డబుల్స్‌లో : విజేత సాత్విక్, ఆదాయ్, ద్వితీయ వీర్, మిథున్

బాలికలు : సింగిల్స్‌లో : విజేత ప్రశాంతి, ద్వితీయస్థానం శ్రీనిధి, తృతీయ వైష్ణవి ,**డబుల్స్‌లో :** విజేత అక్షర, సాన్విక, ద్వితీయ అర్చన, వైష్ణవి, తృతీయ స్థానం సాత్విక, ప్రశాంతి

ఖోఖోలో..

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ ఖోఖో పోటీలను కామారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలికల నుంచి రిత్విక, మనోజ్ఞ, కీర్తి, ఆరాధ్య, రిసిక, రమ్య, నేహా, స్నేహ, నిహారిక, దుర్గాలక్ష్మి, అనన్య, వైష్ణవి, పూజిత, అపూర్వలు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలుర నుంచి ఆదర్శ్, శివ, నవీన్, శ్రీకాంత్, ప్రత్యూష్, రాజేశ్, నిఖిల్, ముఖేశ్, ఆకాశ్, మహేందర్, కిషన్, సాత్విక్, రేవంత్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్, రాము, అశోక్, సురేశ్, సుజాత, నరేశ్‌రెడ్డి, సాయిబాబా, లింగం పాల్గొన్నారు.

చదరంగంలో..

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : నగరంలోని అభ్యాస ఉన్నత పాఠశాలలో చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-15 బాలబాలికల విభాగంలో ఆదివారం జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రతినిధులు అందించారు. చదరంగం క్రీడాకారులు చదువులోనూ రాణిస్తారని సంఘం ప్రధానకార్యదర్శి రమేశ్ అన్నారు. ఉపాధ్యక్షుడు అబ్బాపూర్ రవీందర్, సంయుక్త కార్యదర్శి గంగాధర్, ప్రతినిధులు లక్ష్మణ్, నవ్యకృష్ణ, వైభవ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు :బాలుర : అభిజిత్(అభ్యాస ది స్కూల్), సాయిరుద్ర(కాకతీయ ఒలింపియాడ్ స్కూల్)

బాలికల : రిషిత(నలంద ఉన్నత పాఠశాల), రోషిణి(అభ్యాస ది స్కూల్)

క్రికెట్‌లో..

దోమకొండ: గడీ కోట ట్రస్టు, ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ సంయుక్తంగా నిజామాబాద్ ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ క్రికెట్ ఎంపిక పోటీలు ఆదివారం దోమకొండలోని ఆనంద్ భవన్ మైదానంలో నిర్వహించారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుంచి 78 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 16 మందిని ఉమ్మడి జిల్లా స్థాయి జట్టుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్, గడీ కోట ట్రస్టు సీనియర్ మేనేజర్ బాబ్జీ, మాజీ జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, నాయకులు శంకర్‌రెడ్డి, మధు, కోచరు రామక్రిష్ణ, పీఈటీలు పాల్గొన్నారు.


ఎంపికైన క్రీడాకారులతో ప్రతినిధులు

నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: నగరంలోని పులాంగ్ ప్రాంతంలో ఫీడర్లలో మరమ్మతుల కారణంగా బాల హనుమాన్ దేవాలయం, శ్రీనగర్ కాలనీ, యెండల టవర్ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ నగర ఏడీఈ-3 వీరేశం, డీ-4 సెక్షన్ ఏఈ గంగాశేఖర్ తెలిపారు.

ఓటరు నమోదుపై సమావేశం

నిజామాబాద్ అర్బన్ : యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో వినాయక్‌నగర్ బస్వాగార్డెన్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై సోమవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ హాజరు కానున్నారు.

నుడా ఛైర్మన్‌కు సత్కారం

సుభాష్‌నగర్, న్యూస్‌టుడే: నుడా ఛైర్మన్‌గా నియమితులైన కేశ వేణును ఆదివారం సుభాష్‌నగర్ సెయింట్ అన్స్ చర్చి కౌన్సిల్, యూత్ కమిటీ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో అగస్టిన్, ప్రవీణ్, బాలస్వామి, విన్సెంట్, రాజేశ్ జాబ్సన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మేమున్నాం.. మీకు తోడుగా..

94408 85670
80085 74007
98850 93048

సమస్య: గుండారంలోని ఆరో వార్డులో అంతర్గత రహదారి గుంతలమయంగా మారింది. - **శ్రీనివాస్, గ్రామస్థుడు**

సమాధానం: మట్టి పోయించి పూడ్చి వేస్తాం -**పంచాయతీ కార్యదర్శి, గుండారం**

-నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే

సమస్య: నగరంలోని సాయినగర్‌లో రోడ్డు దెబ్బతింది. **- రాకేశ్, స్థానికుడు**

సమాధానం: మరమ్మతులు చేయిస్తాం.

- ఇనాయత్, ఏఈ, జోన్-2, నగర పాలక సంస్థ

– న్యూస్‌టుడే, నిజామాబాద్ అర్బన్

భక్తిశ్రద్ధలతో బోనాల ఊరేగింపు



పాటిగల్లీ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో..



నాడాపూర్‌లో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



ఎడపల్లిలో..

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం దేవతలకు బోనాలు సమర్పించారు. ఊరపండుగ నిర్వహించారు. ఈ మేరకు మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లారు. ప్రత్యేక పూజలు చేసి అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆరోగ్యంతో ఉండాలని మొక్కుకున్నారు. పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. నిజామాబాద్‌లోని వినాయక్ నగర్, కంఠేశ్వర్‌లో నిర్వహించిన మహాలక్ష్మి అమ్మవారి బోనాల ఊరేగింపులో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే బృందం



సిర్పల్లిలో..



బోనం ఎత్తిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



కొండూరులో..



ధర్పల్లిలో...

రైతును రాజు చేయడమే లక్ష్యం

జక్రాన్‌పల్లి, ధర్పల్లి, సిరికొండ, న్యూస్‌టుడే: రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. జక్రాన్‌పల్లి మండలం సికింద్రాపూర్, బ్రాహ్మణ్‌పల్లి, కొలిప్యాక్ గ్రామాల్లో ఆదివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ గంగారెడ్డి, నాయకులు సాయారెడ్డి, గంగారెడ్డి, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ధర్పల్లి మండల కేంద్రం, సిరికొండలోని పెద్దవాల్గోట్, కొండూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఐడీసీఎంఎస్ ఛైర్మన్ తారాచంద్‌నాయక్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లిలో తూకం వేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

పార్టీలో చేరిక

జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: జక్రాన్‌పల్లి మండలం బ్రాహ్మణ్‌పల్లిలో ఆదివారం పలువురు నాయకులు భారాస నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ సర్పంచి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడికి గరిక పూజలు



సార్వజనిక్ గణేశ్ మండలిలో..

నిజామాబాద్ సాంస్కృతికం : సంకష్టహర చతుర్థి సందర్భంగా ఆదివారం నగరంలోని వినాయక ఆలయాల్లో స్వామివారికి గరికపూజలు నిర్వహించారు. గణపతి హోమాలు, పంచామృతాభిషేకాలు, అర్చనలు, సామూహికంగా పారాయణాలు, అన్నప్రసాద వితరణలు చేపట్టారు. సార్వజనిక్ గణేశ్‌మండలి, సిద్ధివినాయక, ఖిల్లా మహాగణపతి, శుభంకరోతి కల్యాణ గణపతి తదితర మందిరాల్లో మొక్కులు తీర్చుకున్నారు.

ధరల తగ్గింపులో ప్రభుత్వాలు విఫలం



మాట్లాడుతున్న రమేశ్‌బాబు

ఖలీల్‌వాడి : పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నగర మహాసభ నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకట్రాములు, నూర్జహాన్, సుజాత, నర్సయ్య పాల్గొన్నారు.

బీజాక్షర క్షేత్రం సందర్శన

నవీపేట : యంచలోని బీజాక్షర క్షేత్రాన్ని, ప్రాచీన విఠలేశ్వరాలయాన్ని ఉత్తరప్రదేశ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి బ్రిజేష్ కుమార్‌శర్మ ఆదివారం సందర్శించారు. ఈ మేరకు ఆయన ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఐపీఎస్‌ను నిర్వాహకులు, గ్రామస్థులు సన్మానించారు. బీజాక్షర క్షేత్రం వ్యవస్థాపకుడు వేద విద్యానందగిరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ది రైతు వ్యతిరేక పాలన'

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: కాంగ్రెస్‌ది రైతు వ్యతిరేక పాలన అని జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ విఠల్‌రావు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా ఇవ్వకపోవడంపై భారాస శ్రేణులతో కలిసి నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఆదివారం నిరసన తెలిపారు. సగం మంది రైతులకు రుణమాఫీ చేసి చేతులు దులుపుకొన్నారని విమర్శించారు. ఆరు గ్యారంటీలతో పాటు రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు సిర్ప రాజు, నాయకులు సూదం రవిచందర్, సత్యప్రకాష్, లింగం, రాజు, శేఖర్, మహేందర్, మురళి, గంగామణి తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న భారాస నాయకులు

భారాస నాయకుల నిరసన

డిచ్‌పల్లి, న్యూస్‌టుడే : డిచ్‌పల్లి మండల కేంద్రంలో ఆదివారం భారాస నాయకులు నిరసన వ్యక్తం చేశారు. రైతు భరోసా ఎగవేతను నిరసిస్తూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు, కృష్ణ, పద్మారావు, నర్సయ్య, రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి మండల కేంద్రంలో..

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి

నిజామాబాద్ గ్రామీణం: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) జిల్లా సభ్యులు ఎమ్మెల్సీ కోదండరాంనకు ఆదివారం వినతి పత్రం ఇచ్చారు. నగరానికి వచ్చిన ఎమ్మెల్సీని జిల్లా కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. 317జీవో బాధితులకు న్యాయం చేయాలని కోరారు. పెండింగ్ బిల్లులు, పీఆర్సీలు, సీపీఎస్ రద్దు వంటి సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణారెడ్డి, ప్రవీణ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు స్వర్ణసమత, జిల్లా ఉపాధ్యక్షుడు సాయిలు తదితరులు ఉన్నారు.

ఖలీల్‌వాడీ, న్యూస్‌టుడే: తెలంగాణ యూనివర్సిటీలో పార్ట్‌టైం అధ్యాపకులుగా పని చేస్తున్న తమను గుర్తించి కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమించి ఉద్యోగ భద్రత కల్పించాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ ప్రసన్న, ప్రతినిధులు ఎమ్మెల్సీ కోదండరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. 317 జీవో ద్వారా అన్యాయం జరిగిన ఉద్యోగులకు న్యాయం చేయాలని, వైద్య, ఆరోగ్య, ఇతర శాఖల్లోని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కరిపె రవీందర్ కోరారు.

నిజామాబాద్ న్యాయవిభాగం: ఎమ్మెల్సీ కోదండరాంను జిల్లా దివ్యాంగుల ఉద్యోగుల సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఆదివారం జిల్లాకేంద్రానికి వచ్చిన ఆయనను సంఘం అధ్యక్షుడు బి.శంకర్‌రాజు ఆధ్వర్యంలో కలిసి సమస్యలు వివరించారు. కృష్ణమూర్తి, హన్మాండ్లు, మల్లుగౌండ, శంకర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: బోధన్‌లోని నిజాం సుగర్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించి పరిశ్రమ తెరిపించేందుకు కృషి చేయాలని మజ్దూర్ సభ యూనియన్ నాయకులు ఎమ్మెల్సీ కోదండరాంనకు వినతిపత్రాన్ని అందించారు. ఈ మేరకు ఆదివారం జిల్లాకేంద్రంలో ఎమ్మెల్సీని కలిశారు. బకాయి వేతనాలు అందించాలని, పునరుద్ధరణ కమిటీ సత్వరమే నిర్ణయం తీసుకొని పరిశ్రమను తెరిపించాలని కోరారు. లేఆఫ్ ద్వారా తొలగించిన కార్మికుల్ని విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రవిశంకర్‌గౌడ్, శ్రీధర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి తడిసిన ధాన్యం

నవీపేట, న్యూస్‌టుడే: నవీపేట మండలంలో శనివారం అర్ధరాత్రి తర్వాత జోరుగా కురిసిన వర్షానికి రహదారులు, కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. నాళేశ్వర్, యంచ, పొతంగల్, నవీపేటతో పాటు పలు గ్రామాల్లో ఆరబెట్టిన ధాన్యం వానకు తడిసిపోవడంతో రైతులు ఆ ధాన్యాన్ని ఆదివారం మళ్లీ ఆరబెట్టేందుకు అవస్థలు పడ్డారు. ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పచ్చి ధాన్యాన్ని విక్రయించేందుకే మొగ్గు చూపుతున్నారు.



నాళేశ్వర్‌లో తడిసిన ధాన్యం చూపుతున్న రైతు

అలరించిన పాత పాటల వెన్నెల

సుభాష్‌నగర్, న్యూస్‌టుడే: స్వరసౌరభం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని గీతాభవన్‌లో పాటల వెన్నెల కార్యక్రమం నిర్వహించారు. గాయకులు ఆలపించిన అలనాటి సినీగీతాలు అలరించాయి. ప్రముఖ కవి, వ్యాఖ్యాత వీపీ చందన్‌రావు, సంస్థ వ్యవస్థాపకుడు నాగరాజ శర్మ, రాములు, సుజాత, విజయ్‌కుమార్, గిరీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తుల వసతులకు శంకుస్థాపన

నిజామాబాద్ న్యాయవిభాగం : న్యాయమూర్తుల గృహ వసతులకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేందర్, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి, నిజామాబాద్ జిల్లాజడ్జి కుంచాల సునీతలు ఆదివారం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారని బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జగన్ మోహన్‌గౌడ్ తెలిపారు. న్యాయవాదులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

తనిఖీ కేంద్రంలో అప్రమత్తంగా ఉండండి

పొతంగల్, న్యూస్‌టుడే: తనిఖీ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తంగా ఉండాలని బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. పొతంగల్ మంజీర నది వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్రాన్ని ఆయన ఆదివారం తనిఖీ చేశారు. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు వరకు వెళ్లి పరిశీలించారు. ఈ తనిఖీ కేంద్రాల్లో విధులు నిర్వహించే అధికారులు రాకపోకలు సాగించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని చెప్పారు. పొతంగల్ రెండో వంతెన సమీపంలో ఇసుక నిల్వలు పరిశీలించి పోలీసులతో మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు హున్సా, రెంజల్, బోధన్, పొతంగల్ మహారాష్ట్ర శివారు సరిహద్దులో ప్రత్యేక తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు



తొర్లికొండలో..

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రం దుబ్బ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి (2003-04 బ్యాచ్) పూర్వ విద్యార్థులు ఆదివారం నగరంలోని ఓ కల్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. ఆటపాటలతో సందడి చేశారు.

జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే : జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ జడ్పీ పాఠశాలలో 1985-86 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని సందడిగా గడిపారు.



జిల్లా కేంద్రంలో..

హిందూ వాహిని నూతన కార్యవర్గం ఎన్నిక

సుభాష్‌నగర్ : హిందూ వాహిని ఇందూరు నగర శాఖ నూతన కమిటీని ఆదివారం ఏర్పాటు చేశారు. ఆదర్శనగర్ వీహెచ్‌పీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి రెండు తెలుగు రాష్ట్రాల సహ సంయోజక్ లీల సురేశ్, ప్రాంత ప్రశిక్షణ ప్రముఖ్ శ్రావణ్ అతిథులుగా హాజరయ్యారు. నూతన నగర కమిటీలో సంయోజక్‌గా శ్రీకాంత్, సహ సంయోజక్‌గా గజానంద్, సౌమ్య, విద్యాసాగర్, అభినవ్, అయామ్ ప్రముఖ్‌లుగా శ్వేత, రణధీర్, విశ్వక్, పద్మ, శైలేష్, సుధాకర్ బాధ్యతలు చేపట్టారు.



వేగ నిరోధకాల ఏర్పాటు

రెంజల్, న్యూస్‌టుడే: రెంజల్ మండలంలోని బోర్గాంలో ప్రభుత్వ పాఠశాలలకు సమీపంలో రోడ్లు, భవనాలశాఖ అధికారులు శనివారం సాయంత్రం వేగ నిరోధకాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 12న 'ఈనాడు'లో దుమ్ముతో వాహనదారుల ఇక్కట్లు అనే శీర్షికతో ప్రచురితమైన చిత్ర కథనానికి అధికారులు స్పందించారు. బాలలు వాహనాల వేగంతో ప్రమాదానికి గురికాకుండా వేగ నిరోధకాలు ఏర్పాటు చేయించారు. దుమ్ము లేవకుండా రోడ్డుపై నీటిని పట్టి తడిపే విధంగా జాతీయ రహదారి నిర్మాణ గుత్తేదారును ఆదేశించారు.

ఈనాడు కథనానికి స్పందన



బాధిత కుటుంబానికి పరామర్శ

మోపాల్, న్యూస్‌టుడే : బోర్గాం(పి) గ్రామానికి చెందిన నారాయణరెడ్డి (65) అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహానికి నివాళి అర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నుడా మాజీ ఛైర్మన్ ఈగ సంజీవరెడ్డి, నాయకులు నర్సారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హన్మాండ్లు తదితరులు ఉన్నారు.



చికిత్స పొందుతూ మృతి

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఆరోరాణా పరిధిలో మద్యం మత్తులో యాసిడ్ తాగి.. చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహించే చిన్నయ్య (39) ఈ నెల 16న మద్యం మత్తులో నీరు అనుకొని యాసిడ్ తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆయనను చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన శనివారం అర్ధరాత్రి ఆసుపత్రిలో మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో వెంకట్‌రావు తెలిపారు.



చిన్నయ్య

వాహనాల తనిఖీ, 20 మందిపై కేసు

మోపాల్, న్యూస్‌టుడే : మోపాల్ మండల కేంద్రంలో పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ మేరకు నిబంధనలు పాటించని 20 మందిపై కేసులు నమోదు చేసి, రూ.2,500 జరిమానా విధించినట్లు ఎస్‌హెచ్‌వో యాదగిరిగౌడ్ తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే : ఇటీవల డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు పీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బోధన్‌లో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ మేరకు వారిని శాలువా, పూలమాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అశోక్‌రోడే, శ్రీకాంత్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్

• ఆర్మూర్ • బాల్కొండ

66వ వారం శ్రమదానం



ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధి కమిటీ చేపడుతున్న స్వచ్ఛ కాలనీ..సమైక్య కాలనీ కార్యక్రమం 66వ వారానికి చేరుకొంది. ఆదివారం ఉదయం వీధి నెంబర్ 8లో పిచ్చిమొక్కలను తొలగించి, మురుగుకాలువల్లో పూడిక తీశారు. కాలనీ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, ఎల్.టీ కుమార్, సత్యనారాయణ గౌడ్, భూమన్న, రాజు, భూమయ్య, రాజ్ కుమార్, సాయన్న, రవి, గణేశ్, జయరాజ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో మహాలక్ష్మి పండగ

మానిక్‌బండార్(మాక్లూర్ గ్రామీణం), న్యూస్‌టుడే: మాక్లూర్ మండలంలోని మానిక్‌బండార్, బోర్గం, ముత్యంపల్లి, అమ్రాద్, మదన్‌పల్లి గ్రామాల్లో మహాలక్ష్మి పండుగ నిర్వహించారు. గ్రామస్థులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యాలు, పెట్టి ప్రత్యేక పూజలు చేశారు.



మానిక్‌బండార్‌లో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్థులు

మందగిస్తోంది చూపు

అధికంగా డిజిటల్ తెరలు చూడటం.. పోషకాహార లోపం విద్యార్థుల పాలిట శాపంగా మారింది. చిన్నతనంలో కంటి సంబంధిత వ్యాధులకు కారణమైంది. ఆర్మూర్ డివిజన్‌లోనూ ఎక్కువ మంది బడి పిల్లలు కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు రాష్ట్ర బాల సురక్ష కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ఆధ్వర్యంలో చేపట్టిన కంటి పరీక్షల సర్వేతో వివరాలు వెల్లడయ్యాయి.

☛ సర్కారు బడుల్లో కొనసాగుతున్న కంటి పరీక్షలు

☛ 1107 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తింపు

ఆర్మూర్ డివిజన్‌లో...

ఆర్మూర్ డివిజన్‌లో ఇలా.. ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో సెప్టెంబరు మొదటి వారంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంటి పరీక్షలు చేసే కార్యక్రమం చేపట్టారు. ఆర్మూర్ డివిజన్‌లో ఇప్పటి వరకు 29 ఉన్నత, 39 ప్రాథమిక, 30 రెసిడెన్షియల్ బడుల్లో 5 నుంచి 10 వ తరగతి విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. మొత్తం 15,480 మంది విద్యార్థులను పరీక్షించగా 1107 మంది కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు. వీరికి కంటి అద్దాలు అవసరమని నిర్ధారించారు. కార్యక్రమం మరో నెల రోజుల పాటు కొనసాగే అవకాశముందని.. అంతటా పరీక్షలు పూర్తయ్యాక విద్యార్థులకు అవసరమైన కంటి అద్దాలు అందజేస్తామని అధికారులు తెలిపారు.



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

చీకట్లో చదవడం, రాయడం చేయొద్దు

పిల్లలు చీకట్లో చదవడం, రాయడం చేయకూడదు. బాగా వెలుతురు ఉన్నచోట చదువుకోవాలి. కంటికి మేలు చేసే పోషకాహారం తీసుకోవాలి. చరవాణి, టీవీలకు దూరంగా ఉండాలి. వైద్యుల సూచనలు పాటించాలి.

- రాజేష్ వైద్యులు మోర్తాడ్

చరవాణి వాడకంతో అధికం

కరోనా సమయంలో పాఠశాలలు మూసి ఉండడంతో.. విద్యార్థులంతా ఆన్‌లైన్‌లో తరగతులు వినాల్సి వచ్చింది. ఆ సమయంలో వారు చరవాణికి అలవాటు పడిపోయారనే వాదన ఉంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు డిజిటల్ తెరను చూడాల్సి రావడంతో పిల్లల ఆరోగ్యంపై ప్రభావం పడి నేత్ర సంబంధిత సమస్యలకు దారితీసింది. ఇప్పుడు సైతం చాలా మంది విద్యార్థులు ఖాళీ సమయాల్లో స్మార్ట్‌ఫోన్‌తో గడుపుతున్నారు. దీంతోపాటు పోషకాహారలోపం, ఇతర సమస్యలు దృష్టిలోపానికి కారణమవుతున్నాయని వైద్య నిపుణులు చెపుతున్నారు.

న్యూస్‌టుడే, కమ్మర్‌పల్లి

వైద్య పరీక్షలు ఇలా..

• మొత్తం విద్యార్థులు ▼ పరీక్షలు పూర్తయినవారు ❑ కళ్లద్దాలు అవసరమైనవారు

మండలం	• మొత్తం విద్యార్థులు	▼ పరీక్షలు పూర్తయినవారు	❑ కళ్లద్దాలు అవసరమైనవారు
ఆర్మూర్(గ్రామీణ)	3261	1426	126
ఆర్మూర్(పట్టణం)	3460	3460	281
మోర్తాడ్	3621	3420	250
కమ్మర్‌పల్లి	2964	2964	145
బాల్కొండ	2501	1600	41
వేల్పూర్	2861	690	30
భీమ్‌గల్	2473	710	16
నందిపేట్	3261	650	126
మాక్లూర్	2982	560	92

వర్షం.. రైతులకు నష్టం

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ పట్టణంలో శనివారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి వరి పంట దెబ్బతింది. పట్టణ శివారులోని పంట పొలాల్లో పైరు ఒకవైపు వంగిపోయింది. అదే సమయంలో దోబీ ఘాట్ సమీపంలో రోడ్లపై ఆరబెట్టిన వడ్లు తడిసిపోయింది. అకాల వర్షంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.



ఆర్మూర్ పట్టణ శివారులో నేలకొరిగిన వరి

ఉచిత వైద్య శిబిరం

భీమ్‌గల్ గ్రామీణ న్యూస్‌టుడే: భీమ్‌గల్ మండలం ముచ్కూర్ గ్రామ పంచాయతీ భవనంలో నిజామాబాద్‌కు చెందిన వర్ధాన్ హెల్త్ కేర్ స్పెషాలిటీ, క్రిటికల్ కేర్ మేనేజర్ బాబు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలకు ఈసీజీ, చక్కెర, థైరాయిడ్, మూత్రపిండ, పేగు సంబంధించిన పరీక్షలను చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు సృజిల్ బాబు, స్రవంతి, ప్రవళిక, బిందుజ, బాబుజీ, తిరుమల వైద్య కళాశాల విద్యార్థులు, ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, ట్రెజరర్ తుమ్మ సుకేష్, దువ్వాల సుదర్శన్, మహిపాల్, సంతోష్, వీడీసీ సభ్యులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు భూరెడ్డి సంతోష్ రెడ్డి, రాజు, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

మెండోరా, న్యూస్‌టుడే: సోన్‌పేట్ గ్రామానికి చెందిన మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు సోన్‌పేట్ నారాయణ ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్‌కుమార్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. భూమన్న, బాబు సుభాష్, ప్రకాశ్, సలీం, మహేశ్, సాయన్న పాల్గొన్నారు.



'రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్'



మానిక్‌బండార్‌లో కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

మానిక్‌బండార్(మాక్లూర్ గ్రామీణం), న్యూస్‌టుడే: రైతు భరోసా ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నమ్మించి మోసం చేస్తుందని, ఆ పార్టీకి రోజులు దగ్గర పడ్డాయని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి విమర్శించారు. మాక్లూర్ మండలం మానిక్‌బండార్ జాతీయ రహదారిపై ఆదివారం కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు వెంటనే రైతు భరోసా అందజేయాలన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చటంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. రైతుల ఓపికను పరీక్షిస్తే కాంగ్రెస్ కనిపించకుండా మాడిమసైపోతారన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీఛైర్మన్ విఠల్‌రావు, ప్రభాకర్, పడాల శ్రీనివాస్, గంగాధర్, సుక్కిసుధాకర్, చిన్నరాం, నర్సాగౌడ్, అభిలాష్, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై ఉక్కుపాదం!

☛ సైబర్ నేరాల అడ్డుకట్టకు అవగాహనే మందు

☛ ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వరరెడ్డి

న్యూస్‌టుడే, ఆర్మూర్



ముఖాముఖి

గంజాయి, గుట్కా, కల్తీ కల్లు విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. వీటికి బానిసలై నేరాలకు చాలా మంది పాల్పడుతున్నారని పేర్కొన్నారు. పిల్లలు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, ఆర్మూర్ ప్రాంతంలో జూదం అడ్డాలపై, గల్ఫ్ ఏజెంట్ల మోసాలపై నిశిత పరిశీలన ఉందన్నారు. ఎలాంటి వారినైనా సరే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలుంటాయని హెచ్చరించారు. వెంకటేశ్వరరెడ్డి ఇటీవల ఆర్మూర్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టారు. ఆయనతో 'న్యూస్‌టుడే' ముఖాముఖి నిర్వహించింది. మరిన్ని విషయాలు ఆయన మాటల్లోనే..

ప్రత్యేక బృందాలు ఏర్పాటు

ఆర్మూర్ ప్రాంతానికి చేరుతున్న గంజాయి, గుట్కా తదితర మత్తు పదార్థాలపై గట్టి నిఘా పెడుతున్నాం. అంతర్రాష్ట్ర సరిహద్దులతో పాటు నిర్మల్, జగిత్యాల జిల్లాల నుంచి వచ్చిపోయే వాహనాలపై దృష్టి పెట్టాం. పల్లెల్లోనూ ప్రత్యేక అడ్డాలు ఏర్పాటు చేసుకుని విక్రయిస్తున్న వారి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి. విక్రయదారులతో పాటు వాటిని సేవించే వారిపైన కేసులు నమోదు చేస్తున్నాం.

జూదం నియంత్రిస్తాం

ఈ ప్రాంతంలో కొందరు అదే పనిగా జూదానికి అలవాటుపడ్డారు. ఖాళీ సమయం దొరికితే ఆటకు దిగుతున్నారు. వ్యవసాయ క్షేత్రాలు, నివాస, నిర్మానుష్య ప్రాంతాలు, గోదావరి సరిహద్దు గ్రామాల్లో ఎక్కువగా ఆడుతున్నట్లు గుర్తించాం. స్థానిక ఠాణాలను అప్రమత్తం చేశాం. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు దాడులు చేస్తున్నాయి. ఎక్కడైనా ఆడితే డయల్-100 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

గల్ఫ్ ఏజెంట్ల ఆగడాలు అరికడతాం

ఉద్యోగ, ఉపాధి అవకాశాలను గల్ఫ్ ఏజెంట్లు ఆసరాగా తీసుకుంటే సహించం. నకిలీ వీసాలిచ్చే వారిపై కఠినంగా ఉంటాం. ఉద్యోగాలకు ఇంటర్వ్యూల పేరిట అనధికారికంగా పిలిస్తే చట్టపరమైన చర్యలుంటాయి. ప్రస్తుతం కంపెనీ వీసాల వివరాలు ఆన్‌లైన్‌లో తనిఖీ చేసి ధ్రువీకరించుకున్న తర్వాతే నిరుద్యోగులు అడుగు ముందుకేయాలి. ఎక్కడైనా మోసాలు చేసే ఏజెంట్లపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

బల్దియాలో ట్రాఫిక్ కష్టాలపై దృష్టి

ఆర్మూర్ బల్దియా ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించాం. సిగ్నళ్లు తరచూ మొరాయిస్తున్నాయని తెలిసింది. ఈ వ్యవస్థను మెరుగుపరుస్తాం. వాటిని వీలైనంత తక్కువ సమయంలో పరిష్కరించేలా దృష్టి పెడుతున్నాం. వాహనాల నియంత్రణ, నిబంధనలను ఉల్లంఘించే వారిపై కొత్త చట్టాలను అమలు చేస్తున్నాం.

దొంగతనాలపై గస్తీ

తాళం వేసిన ఇళ్లనే దొంగలు లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీపావళి, రానున్న సంక్రాంతి పండగలకు, శుభకార్యాలు, పుణ్య క్షేత్రాల సందర్శనకు వెళ్తే సంబంధిత ఠాణాలో సమాచారం ఇవ్వండి. ఇంట్లో విలువైన వస్తువులు, నగదు ఉంచకూడదని గుర్తించాలి. చుట్టూ పక్కల వారికి సమాచారం ఇవ్వాలి. గ్రామాల్లో గస్తీ బృందాలను ఏర్పాటు చేస్తున్నాం.

ప్రజలను చైతన్య పరుస్తున్నాం

ఇటీవల ఆన్‌లైన్ మోసాలు ఎక్కువవుతున్నాయి. ఉద్యోగాల పేరిట వల వేసి అందినకాడికి దండుకుంటున్నారు. ప్రముఖుల ఫొటోలతో డీపీలు పెట్టుకుని కాల్స్ చేసి నమ్మిస్తున్నారు. ఇటీవల ఏసీబీ, ఈడీ అధికారుల మంటూ కాల్స్ వస్తున్నాయి. బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. ముఖ్యంగా రైతులు తమ పంట డబ్బులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను నుంచి వచ్చే ప్రయోజనాలను దెబ్బ కొట్టేందుకు సైబర్ నేరగాళ్లు కాచుకుని ఉన్నారు. దీనిపై ప్రజల్లో చైతన్య పెంపొందిస్తాం. ఇప్పటికే గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

నాట్య గురువుకు సన్మానం

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ పట్టణానికి చెందిన నాట్య గురువు డా. మృణాళినిని ఆదివారం రాంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. శాస్త్రీయ నృత్యం, పేరిణి, ఆంధ్రనాట్యంలో శిక్షణ ఇస్తూ కళాకారులను తీర్చిదిద్దుతున్న మృణాళినికి ఇటీవల వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ సంస్థ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. కార్యక్రమంలో నటరాజ నృత్యానికేతన్ వ్యవస్థాపకుడు మాడవేడి నారాయణ, సమన్వయకర్త కోకిల నాగరాజు, ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు సాయిబాబ, చంద్రయ్య, మధు, తదితరులు పాల్గొన్నారు.



మూఢనమ్మకాలను ప్రోత్సహించొద్దు

మాక్లూర్, న్యూస్‌టుడే: మూఢత్వాన్ని ప్రోత్సహించొద్దని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కోయిడి నర్సింలు పేర్కొన్నారు. మాక్లూర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రాల పేరులో విద్యార్థినులను భయాందోళనకు గురి చేసిన కస్తూర్బా పాఠశాల సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. మాయమైన బంగారు గొలుసు కోసం విద్యార్థినిని మంత్రగాడి వద్దకు తీసుకెళ్లడం శోచనీయమన్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాల్సిన ఉపాధ్యాయులే మూఢ నమ్మకాల బాట పట్టడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. బడుల్లో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పాలని సూచించారు. జనవిజ్ఞాన వేదిక మండల కన్వీనర్ బోడ ప్రమోద్, కట్ట నరేష్‌కుమార్, వెంకటమల్లయ్య, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు నర్సింలు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మాక్లూర్, న్యూస్‌టుడే: ఎట్టి పరిస్థితుల్లోనూ దళారులకు వడ్లు అమ్మొద్దని అన్నదాతలకు మాక్లూర్ సహకార సంఘం ఛైర్మన్ బూరొల్ల అశోక్ సూచించారు. గుంజిలి, కొత్తపల్లి, చిక్లి, వల్లభాపూర్, ముల్లంగి, బొంకన్‌పల్లి, గొట్టుముక్కల, ధర్మోర గ్రామాల్లో ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. విండో మాజీ ఛైర్‌పర్సన్ గోపు లక్ష్మి, నాయకులు దయాకర్ రావు, భరత్, షబ్బీర్, ప్రసాద్‌రావు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్ గ్రామీణం, న్యూస్‌టుడే: భీమ్‌గల్ మండలం జాగిర్యాల్ గ్రామంలో రైతు సేవ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఛైర్మన్ శివసారి నర్సయ్య ప్రారంభించారు. సన్న రకాలకు మద్దతు ధర క్వింటాకు రూ.2300, దొడ్డు రకాలకు రూ.2320 చెల్లించనున్నట్లు తెలిపారు. సీఈవో రవీందర్, డైరెక్టర్ నూకల లింబాద్రి, వీడీసీ సభ్యులు, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



జాగిర్యాల్ గ్రామంలో



బంగారు గొలుసు దొంగతనం

మోతె(వేల్పూర్), న్యూస్‌టుడే: మోతె గ్రామానికి చెందిన మహిళ మెడలో నుంచి ఆదివారం గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బంగారు గొలుసు దొంగిలించినట్లు ఎస్సై నాగ్‌నాథ్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. మోతె గ్రామానికి చెందిన చింతలపల్లి రాజు అనే మహిళ పడగల్‌లో తన బంధువుల ఇంటికి వెళ్లడానికి వేల్పూర్ క్రాస్ రోడ్డు వద్ద బస్సు కోసం వేచి ఉంది. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలో నుంచి రెండున్నర తులాల బంగారం గొలుసు లాక్కొని ఎత్తుకెళ్లారు. దుండగులు మెట్‌పల్లి వైపు వెళ్లినట్లు పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి ఆత్మహత్య

నందిపేట్ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిపేట్ మండలం కుద్వాన్‌పూర్ గ్రామానికి చెందిన మేతరి అశోక్ (40) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. ఈ నెల 18న ఇంట్లో నుంచి ఒంటరిగా వెళ్లిన ఈయన మారంపల్లి, వన్నెల్ (కె) మధ్య గల గోదావరి వెనుక జలాల వద్ద గల వాగు వంతెన వద్ద ఆదివారం శవాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు. బాధితుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎల్లయ్య మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

అవీ...ఇవీ.. అన్నీ

మాజీ రాష్ట్రపతి జయంతి

రామన్నపేట్(వేల్పూర్), న్యూస్‌టుడే: మాజీ రాష్ట్రపతి కేఆర్ నారాయణ జయంతి వేడుకలను ఆదివారం రామన్నపేట్‌లో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. గంగాధర్, జాంబవ, రాజన్న, రవి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండ మండల కేంద్రానికి చెందిన మారంపెల్లి అశోక్ కుమారుడికి ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. సమాచారం తెలుసుకున్న రాష్ట్ర కో-ఆపరేటివ్ ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి చికిత్స నిమిత్తం రూ.5 వేలు అందజేశారు. పట్టణ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, జావీద్, ప్రవీణ్‌గౌడ్, ఇమ్రాన్‌ఖాన్, గంగాధర్ పాల్గొన్నారు.

ఆర్మూర్ పట్టణంలో..

ఆర్మూర్ పట్టణం: మామిడిపల్లికి చెందిన ఔట్‌సోర్సింగ్ కార్మికురాలు వసంత ఆదివారం మృతి చెందింది. కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్, రవిగౌడ్ ఆమె కుటుంబాన్ని పరామర్శించి, రూ.10 వేల సాయం అందజేశారు.

బెంచీల వితరణ

నందిపేట్ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిపేట్ మండలం బజార్‌కొత్తూర్ గ్రామంలో టైగర్ యూత్ ఆధ్వర్యంలో బెంచీలను విరాళంగా అందజేశారు. ప్రధాన కూడళ్ల వద్ద ఆదివారం ఏర్పాటు చేశారు. రాంబాబు, సంతోష్, లక్ష్మీనారాయణ, మల్లేశ్, గంగాధర్ పాల్గొన్నారు.

ధ్యాన సాధన చేయాలి

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు ధ్యాన సాధన చేసి, శాకాహారమే తీసుకోవాలని పీఎంసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ అన్నారు. ఆదివారం ఆర్మూర్ నవనాథ సిద్ధులగుట్టపై



నిర్మించిన సిద్దేశ్వర పిరమిడ్‌ధ్యాన మహా శక్తి క్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాఘవరావు, పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణారెడ్డి, తిరుమల గంగారాం, గంగారెడ్డి, లక్ష్మణ్, లక్ష్మారెడ్డి, దయానంద్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ముత్యం సంస్మరణ సభ

భీమ్‌గల్ గ్రామీణం: ప్రొఫెసర్. కె. ముత్యం విప్లవ సాహిత్య కళాకారుడని ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం పేర్కొన్నారు. ఆదివారం ప్రొఫెసర్. కె. ముత్యం స్వగ్రామం బాచన్‌పల్లిలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభకు ఎమ్మెల్సీ ప్రొ. లింబాద్రి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సోయం గంగులు, సునాముని గాథ వంటి 25 పుస్తకాలను రాశారని ఎమ్మెల్సీ తెలియజేశారు. నర్సయ్య, సురేందర్, పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాలు



బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-02 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరుపుకున్నారు. తీపి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకున్నారు. విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు.

మాక్లూర్, న్యూస్‌టుడే: మాక్లూర్ పాఠశాలకు చెందిన 1999-2000 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. తీపి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. ఏంచేస్తున్నావ్?, ఎలా ఉన్నావ్?.. అంటూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.



డంపు కొడుతోంది కంపు!

ఆర్మూర్ పట్టణంలోని ఖాళీ స్థలాలు మినీ డంపింగ్ యార్డును తలపిస్తున్నాయి. వ్యర్థాలు వాహనాల్లో డంపింగ్ యార్డుకు తరలిస్తున్నా, ఖాళీ స్థలాల్లో ఇంకా దర్శనమిస్తున్నాయి. ఆర్మూర్ రాజారాంనగర్ కాలనీ నుంచి మామిడిపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వెళ్లేదారిలో ఉన్న ఖాళీ స్థలంలో చెత్త కుప్పలు పేరుకొంటున్నాయి. నివాసాలకు ఆమడ దూరంలో ఉన్న వాటిని కొందరు కాల్చివేస్తున్నారని, దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. పుర అధికారులు వాటిని తొలగించి, మళ్లీ వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, ఆర్మూర్ పట్టణం



గతుకుల రోడ్డు... మరమ్మతులు కరవు

ముప్కాల్(బాల్కొండ): నల్లూర్ నుంచి పెద్ద వాగు వరకు రోడ్డు. వాహనదారుల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. నల్లూర్ నుంచి రెంజర్ల వరకు అధ్వానంగా మారింది. కొత్తపల్లి, నాగంపేట్, రెంజర్ల, వెంచిర్యాల్, వెల్గటూర్ తదితర గ్రామాల వారు ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. అలాగే ముప్కాల్ మండలం వైపు నుంచి అటు ఏర్గట్ల, ఇటు మోర్తాడ్ మండలాల వైపు రోజు వందల సంఖ్యలో వాహనాలపై ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ద్విచక్రవాహనాలతో పాటు, కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు తిరుగుతుంటాయి. పలు చోట్ల రహదారి పై గుంతలు పడి ప్రమాదకరంగా తయారైంది.

హెచ్చరిక బోర్డులతో సరి..

ముప్కాల్ మండలం నాగంపేట్ సమీపంలో నాగంపేట్ శివారులోనివంతెన వద్ద రోడ్డు మధ్యలో కుంగింది. వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. రాత్రి సమయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా వచ్చినా కిందపడటం ఖాయం. ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేయించడం లేదు. కేవలం కుంగిన చోట ప్రమాదం స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేసి వదిలేశారు. రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.



ఏర్పాటు చేసిన హెచ్చరిక..



గుంతలు ఇలా..